# అడల్ట్స్ ఓన్లీ కథ



# ఎనిమిది కాళ్ళ దోమ

''కలకత్తా రీజనల్ ఆఫీసులో ఇంటర్ బ్రాంచ్ ఎకౌంట్స్ రికన్సిలియేషన్‌కు వెళ్ళాలి- ఎవరెళతారో చేతులెత్తండి!'' అని మా మేనేజర్ అంటే ముందుకి దూకింది నేనే.

''ఇది జనవరి- అక్కడ ఇప్పుడు మినిమమ్ టెంపరేచర్ ఎనిమిది!''

''అయిదుంటే ఇంకా బాగుంటుంది!'' అన్నాను హుషారుగా.

నేను కలకత్తా మహానగరాన్ని చూడాలనే కోరికతో వెళ్ళటం లేదు. గొప్పగా చెప్పుకునే దక్షిణేశ్వర్‌కు గాని, పక్కనే వున్న వివేకానంద మెమోరియల్‌కు గాని వెళ్ళాలనే ఆశతో కాదు. హుగ్లీనదిలో బోటు షికారుకూ కాదు.

అక్కడ నా మేనమామ ఉన్నాడు.

ఆయనకో పంచదార చిలక లాంటి కూతురున్నది.

★ ★ ★

ఇంటికి వస్తూనే మా మామయ్యకు ఫోను చేశాను.

ఆయన ఓ పబ్లిక్ సెక్టార్ బాంకులో సీనియర్ మేనేజర్. మూడేళ్ళు ఇతర రాష్ట్రాలలో ఓ నగరవాసం చేయాలనే కారణంతో రెండు సంవత్సరాల క్రితం అక్కడకు వెళ్ళాడు.

నేను క్రితంసారి శశిరేఖను చూసింది విశాఖపట్నంలో సంవత్సరం క్రితం మా పెద్దమామయ్య కూతురు పెళ్ళిలో.

అప్పటికే అది టిక్కు-టిక్కు-మంటూ ఎత్తుమడమల చెప్పులతో ఆ పెళ్ళి పందిరిని ఒక ఊపు ఊపేసింది.

నా ఖర్మ ఫోనెత్తింది అదే.


''చంద్రమోహన్‌గారు ఉన్నారా?'' అన్నాను గొంతు మార్చి.

అది క్షణంలో గుర్తుపట్టేసింది. ''ఓ మిమిక్రీ రాజా! ఏమిటీ అకాల వర్షం?'' అన్నది పెద్దగా.

ఇక చేసేదేమున్నది. ''పదహారో తారీఖు ఫలక్‌నామాలో బయల్దేరి కలకత్తా వస్తున్నాను. మళ్ళా అక్కడ యిరవై ఒకటి ఉదయాన్నే ఎక్కుతాను! ఆఫీసు పని!''

''అరే..క్యా బాత్ హై!'' ఎగిరి గంతేసినట్లున్నది పెద్ద శబ్దమయింది. ''ఇంకోవారం రోజులు శెలవు పెట్టగూడదూ. హాయిగా రోడ్లన్నీ తిరిగేయవచ్చు!''

''నీకా ఉద్యోగం సద్యోగం లేదు. మా కంపె



**శృంగార కథల పోటీలో బహుమతి అందుకున్న రచన**

**పి. ఎస్. నారాయణ**

నీలో నేను ఒక్క రోజు లేకపోయినా పనులన్నీ పుటుక్కుమని ఆగిపోతయ్!''

''కోచ్ నెంబరు ఎంత?''

''రేపుగాని తెలియదు!''

''వచ్చేటప్పుడు రెండు కిలోల దోసకాయలు పట్టుకురా.. మా అత్తయ్యను వేరే ఇంకో కిలోతో దోసావకాయ పెట్టి ఇవ్వమను. జాగ్రత్త సీసాకు గట్టిగా మూతపెట్టు''

''ఇంకేమైనా కావాలా?''

''రేపు కోచ్ నెంబరు చెబుతావు కదా... అప్పుడు చెబుతాను. కాగితం కలంతో రెడీగా వుండు!''

''నేనొస్తున్నది ఒక్కడినే!''

''సామాన్లు దించటానికి అక్కడా ఇక్కడా కావాల్సినంతమంది పోర్టర్లు ఉంటారు. అక్కడ ఆటోలో రా... ఇక్కడ నేను కారు తీసుకు వస్తాను!''

''హతోస్మి!'' అన్నాను ఒక చేతినే నెత్తిన పెట్టుకొని- రెండో చేయి ఫోనును పట్టుకొని ఉండటంతో.

చల్లగాలీ, పిల్లగాలీ రెండూ బాగానే ఉంటాయి గానీ- ఒక్కొక్కసారి ఈడ్చికొడితే వణికేది మనమే! సరే ఏం చేస్తాం.. నాలుగు రోజులు దాని గుప్పిటలో గిలగిలలాడినా ఆ ఆనందం వేరు.

పదహారు సాయంత్రం ఆరు గంటల సమయంలో ఫలక్‌నామాలో త్రీ టైర్ ఏసీలో పక్క బెర్త్ క్రింద సామాన్లు పెట్టుకొని- ఓ బాబురావు పక్కన కూర్చున్నాను. ఆ సామాన్లలో శశిరేఖ చెప్పినవే కాకుండా, అమ్మ స్వయంగా చేసిన మైసూరుపాకు పెద్ద స్టీలుడబ్బా నిండా వున్నది. దానికి అదంటే నన్ను మించిన ఇష్టంట. మా అమ్మ ఉవాచ!

తిక్కల్ది. దానికి ఎంత అందముందో అంత పొగరూ ఉన్నట్లే మాట్లాడుతుంది.

విశాఖపట్నంలో పెళ్ళిలో నేనున్న యిరవై నాలుగు గంటల్లో ఓ పావుగంట నన్ను ఒంటరిగా పట్టుకు దులిపేసింది.

''వచ్చి రెండు గంటలయింది. మరదలు పిల్లతో ఓ పావుగంట ముద్దూ ముచ్చటా ఏమీ లేదా.. ఎంతసేపూ ముసలాళ్ళ దగ్గర కూర్చొని సొల్లు కబుర్లేనా?''

''నేనేమన్నా నీలాగా చెన్నయ్, ముంబాయ్, కలకత్తాలల్లో పెరిగానా.. గుంటూరు మాజేటి గురవయ్య హైస్కూల్‌లో బుద్ధిగా చదువుకొని గుట్టుగా తాతయ్య దగ్గర పెరిగాను!''

''అబ్బో... అమ్మ సంగతి మేనమామ దగ్గరా అని.. మీ తాతయ్య సంగతి నా దగ్గర చెబుతావా? ఆయనకు ముగ్గురు పెళ్లాలటగదా?'' అన్నది కొంటెగా నా వంక చూస్తూ.

దాన్ది నోరు కాదు. ఎంత మాటంటే అంత మాట అనేయటమే. ఆయనగారు బ్రతికున్న రోజుల్లో ఏదో సరదాపడ్డాడేమో చచ్చినిన్నేళ్ళకు పెళ్ళిపందిట్లో పట్టుకు సాగదీయాలా ఆ విషయాన్ని?

''రెండు పీకానంటే..'' చేయెత్తబోయాను.

మెడను అదోరకంగా వంచి ''ఉగాది పచ్చడిని చేదుగా ఉన్నంత మాత్రాన తినడం మానేస్తామా? సరేగాని సాయంత్రం ఎవరూ చూడకుండా ఏ బీచ్‌కో పారిపోదాం. తయారుగా వుండు!'' కళ్ళు చికిలించి నవ్వుతూ గుసగుసలాడి నలుగురిలో కలిసిపోయింది 'త్తైత్తై'మంటూ.

అన్నంతపనీ చేసింది. ఎటో చూస్తూ ఎవరితోనో మాట్లాడుతున్న నా వెనగ్గా వచ్చి నా భుజం గిల్లి, రోడ్డెక్కి ఆపైన ఆటో ఎక్కి కూర్చున్నది. వెంటనే వెనగ్గా వెళ్ళకపోతే తిరిగి వచ్చి చొక్కాపట్టుకు లాక్కువెళ్ళినా వెళ్ళవచ్చు!

ఆ సాయంత్రం సముద్రపు గాలి చెమటలు కారుస్తున్నా, శీతల పానీయాలు త్రాగుతూ, ఐస్‌క్రీంలూ తింటూ కబుర్లే కబుర్లు.

ఓ ఓటి పడవ పక్కన ఇసుకలో కూర్చున్నాం.

''ఇంతకీ తమరి పెళ్ళి ఎప్పుడట?'' అన్నది నా కళ్ళల్లోకి కవ్విస్తున్నట్లుగా చూస్తూ.

''ఏమో మా అత్తయ్య- మల్లెపువ్వులా పెంచిన మా అమ్మాయిని రంగరంగవైభవంగా పెళ్ళి చేసి అత్తగారింటికి పంపించేది ఆ ముసలాళ్ళకి చాకిరీ చేసేటందుకా.. మా అమ్మాయికి పెళ్ళి చేసినా చస్తే అత్తగారింటికి పంపించనన్నదట.. నేనేమో మా అమ్మకూ, నాన్నకూ ఒక్కడినే కొడుకును.. అదే ఆలోచిస్తున్నాను.. ఏం చేయాలా అని!''

పళ్ళు బిగపట్టి, కళ్ళెర్ర చేస్తూ ''మా అత్తయ్య అన్నదటగా.. అత్తింటికి వచ్చిన కోడలు పిల్ల మాటకు ముందు పుట్టిల్లు పుట్టిల్లు అంటూ పెట్టె తీసుకు తయారయిందంటే కాళ్ళిరగ్గొడతానని. ఆ మాట విని మా అమ్మేమో.. పోనీలే.. మీ నాన్న ఎలాగూ జైపూర్‌కు బదిలీ అవుతుందంటున్నారు గదా అప్పుడు పెళ్ళి చేసుకుందువు గాని, తొందరపడబోకు అని!''


''ఆ ఊరు వెళితే ఏమిటిట''


''మట్టి బుర్ర.. అక్కడ కాళ్ళు తయారు చేస్తారుగా.. అత్తగారు విరగ్గొట్టినప్పుడల్లా కొత్తవి చేయించుకోవచ్చని!'' అన్నది ఓరగా నా వంక చూస్తూ.

అటూ ఇటూ చూడకుండానే నెత్తిన రెండు మొట్టాను. చటుక్కున నా చేయి పట్టుకొని కిలకిలా నవ్వుతూ ''కలకత్తా సముద్రం మా యింటికి

## గ్లామరస్ నిషా!

**బాలీవుడ్‌లో ఇప్పుడు మెల్లగా తనదైన ఇమేజ్‌ని పెంచుకుంటోంది గ్లామరస్ నిషా కొఠారి. రామ్‌గోపాల్ వర్మ 'జేమ్స్' సినిమాలో తన అందచందాల్ని ఎంచక్కా ఆరేసిన నిషా, ఆ తర్వాత ఐటమ్ గాళ్‌గానూ నటించింది. తాజాగా 'శివ-2006'లో హీరోయిన్‌గా నటించిన నిషా ఇందులోనూ రొమాంటిక్ పోజులతో జనాల్ని ఆకట్టుకునే ప్రయత్నం బానే చేసింది. తెలుగులో కూడా నిషా నటించవచ్చునే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.**





## ఆ గార్డు లేకపోతే...

కొయినా మిత్రా ఫ్లాట్‌లో ఈమధ్య ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరిగిందిట. ఫలితంగా ఇంట్లోని వస్తువులన్నీ అగ్నికి బూడిద కావడం మొదలైంది. అలాంటి సమయంలో గ్యాస్ సిలిండర్ గనక పేలితే ఇంకేమైనా వుందా? మొత్తం అపార్ట్‌మెంట్‌కే ఎసరొస్తుంది! ధైర్యం చేసిన సెక్యూరిటీ గార్డు కొయినా మిత్రా కిచెన్‌లోకెళ్లి ఆ సిలిండర్‌ని జాగ్రత్తగా బయటకి తీసుకొచ్చేశాట్ట. దాంతో కొయినాతో సహా అంతా ఊపిరి పీల్చుకున్నారట. సెక్యూరిటీ గార్డ్ సాహసానికి మెచ్చిన కొయినా అతనికి వెంటనే 20 వేల నగదుని బహుమతిగా ఇచ్చేసింది. ఆ నష్టం మాటెలా వున్నా సెక్యూరిటీ గార్డు సాహసాన్ని మరువలేనంటుంది.

చాలా దూరం.. నీతో కలిసి ఈ ఇసుకలో పరుగెత్తాలని ఉంది లే బావా!'' అంది లేచి నిలుచుంటూ.

మరునాడు రాత్రి పదకొండు గంటలకు పద్దెనిమిదో నెంబరు ప్లాట్‌ఫారం మీద రైలు ఆగితే, సెలైన్ బాటిల్ పట్టుకు నిలుచున్నట్లుగా చల్లటి మంచినీళ్ళ సీసాతో నా కోచ్ ముందు శశిరేఖ నిమ్మకాయలంత తన కళ్ళనూ దబ్బకాయలంత చేసుకొని నన్నే చూస్తూ నిలబడి వుంది.

'ఓ దేవతా.. పన్నీరు చిలకరించుతున్నావా మూడు గంటలు ఆలస్యంగా వచ్చిన రైలుకు..' అనుకున్నాను తాదాత్మ్యంగా ఆ బంగారు బొమ్మనే కన్నార్పకుండా చూస్తూ.

చేతిలో సామాన్లు అందుకొని వెనక్కు తిరిగింది. ఉలిక్కిపడ్డట్లుగా చూసాను దాని వంక. విశాఖపట్నంలో చూసిన, పిరుదుల దాకా ఊగిపోయే, దాని ఒత్తయిన ఆ జడ ఏమైందో అర్థం కాలేదు. ప్లాట్‌ఫారం మీద గుడ్డిదీపాల వెలుగులో పరీక్షగా చూస్తే భుజాల దాకా కత్తిరించుకున్న జుట్టు.

''ఏమైందే... నీ బారెడు జుట్టును జానెడు చేశావ్... అదేం రోగం!''

''కలకత్తా చెమటలతో చచ్చేదానికంటే ఈ రోగమే బాగుంటుందనిపించింది!''

విసుక్కుంటున్నట్లుగా అరిచాను. ''ఇంకోసారి దానిమీద కత్తెర పడిందో పెళ్ళి చేసుకొని మరీ విడాకులిస్తాను!''

దాని మొఖార విందమే కాదు, కళ్ళను ఆకట్టుకునేది ఆ జడకట్టు కూడా!

అది పకపకా నవ్వింది. ''బాగుంది. ఎవరైనా పెళ్ళి కాకుండానే విడాకులిస్తారేమిటి.. అలాంటిదే మన్నా వుంటే చేసి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాలనా ఆశ... పన్నెండవుతోంది. ముందు కొంపకు జేరి నాలుగు చెంబులు నీళ్ళు పోసుకుంటే కళ్ళకు అన్నీ అందంగానే కనబడతాయిగాని పద!'' అన్నది బరబరా నన్ను ముందుకు లాక్కువెళుతూ.

విశాఖపట్నం పెళ్ళి పందిటిలో దాని రూపమే గుర్తుకు రాగా మరింత చికాకు పడ్డాను. అంత పొడుగు జడ మీద పెళ్ళివారు పంపిన మల్లెపూలన్నీ అదే పెట్టుకున్నదా అన్నట్లుగా మెరిసిపోతూ...

భోజనం చేసి, మంచమెక్కేటప్పటికి ఒంటి గంట దాటి అరగంట అయింది.. కూలర్ ఆన్ చేసినా శరీరం చెమటలు కారుస్తూనే వున్నది. ఆ చందమామ వచ్చి వంటరిగా వున్న నా గదిలో కూర్చున్నా ఈ బాధ మరిచిపోగలిగే వాడినేమో!

మరునాడు ఎనిమిదింటికి గాని మెలకువ రాలేదు. కళ్ళు తెరుస్తుండగానే ఎదురుగా అమ్మవారు ఆసీనురాలై నా వంకే చూస్తూ కనబడింది రాత్రి నిద్రలేని తనాన్ని మరిచిపోయేలా.

నవ్వుతూ లేచి కూర్చున్నాను.

''తమరు మొఖం కడుక్కొని కాఫీ తాగుతారా, కాఫీ తాగి మొఖం కడుక్కుంటారా?''

''తమరు ఎలా అంటే అలా!''

''అదుగో బాత్‌రూం.. ఇదుగో టవల్.. నీ పెట్టెలోనుంచి బ్రష్షూ, క్లీనరూ తీసి టీపాయ్‌మీద పెట్టాను. అయిదు నిముషాల టైం ఇస్తున్నాను. కాఫీ కలిపి తెస్తాను. ఒకసారి కలిపిన ఫిల్టర్ కాఫీని మరోసారి వెచ్చబెట్టాల్సి వస్తే దాని రుచి చచ్చూరు కుంటుంది. తరువాత నీ యిష్టం!''

ముందు కాఫీ, తరువాత స్నానం, ఆపైన అల్పాహారం.. నేను ఆఫీసుకు తయారయ్యేటప్పటికి అది వాకిట్లో కారు స్టీరింగ్ వెనకాల కూర్చొని తయారు.

''ఇప్పుడు నేను దించుతాను పార్క్ స్ట్రీట్‌లో మీ ఆఫీసు ముందు.. సాయంత్రం టాక్సీలోరా.. నాకు వీలుపడదు!''

''ఇప్పుడూ నేను టాక్సీలోనే వెళతాను!''

''నేను నీకోసం రావటం లేదు. ఎస్ప్లనేడ్‌లో నాకూ కాస్తంత పని వుంది... మా ఫ్రెండ్ ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్. నేను ఇంటికి రెండింటికల్లా వస్తాను. ఆ బోడి ఆఫీసు పనేదో తెముల్చుకొని త్వరగా ఇంటికి రా!''

★ ★ ★

''ఇంతకీ మన ఎంగేజ్‌మెంట్ ఎప్పుడట?''

సాయంత్రం ఆరు గంటలప్పుడు మేడమీద బాల్కనీలో కూర్చొని చెప్పుకుంటున్నప్పుడు శశిరేఖను అడిగాను.

''ఇంట్లో కలకత్తా తమలపాకులు కావాల్సినన్ని వున్నయ్. తెమ్మంటావేమిటే ఇచ్చిపుచ్చుకుందాం.. ఒక పని చెయ్.. మీ అత్తచెవిలో ఓ మాట వేసి వెళ్ళు.. మీ మామయ్య అమలాపురం ఫోను చేసి బ్రహ్మగారి చేత లగ్నాలు పెట్టిస్తాడు!''

''మీ అత్తయ్య, మామయ్య అనుమతి అవసరం లేదా?''

''నువ్వు నన్ను చేసుకుంటుంటే కావాలి.. నేను నిన్ను చేసుకుంటుంటే దేనికమ్మా!''.

నా బుర్రలోకి ఆ మాట ఎక్కేటప్పటికి అది ఆ గదిలోనుంచి మాయమయి, అయిదు నిముషాల తరువాత ట్రేలో రెండు కప్పుల్లో రసగుల్లాలు పెట్టుకు తయారయింది.

దీని లెక్క చూస్తుంటే నన్ను మా అమ్మా నాన్నకు కాకుండా చేసేలా వున్నది. మురిపెంగా నవ్వుకున్నాను!

''మొన్నామధ్య మీ అత్తయ్య మా అత్తయ్యతో- వీళ్ళ తిక్క ఎప్పుడు వదిలిద్దామమ్మా వదినా- అంటూ ఫోనులో సాగదీస్తే- కోతి వేషాలు వేసే నీ కూతురికి ఆమాత్రం తెలివుంటే ఎప్పుడో పెళ్ళయిపోయేది. వాడిని లగ్నాలు ఎప్పుడు పెట్టించమంటావురా అని ఎన్నిసార్లడిగినా ఇప్పుడు తొందరేమిటే అమ్మా అని నాన్చుతున్నాడంటే- నీ కూతురు ఎంత తెలివిగలదో అర్థమయిపోతున్నది- అన్నదట. నాకు ఛర్రున కోపమొచ్చి నెత్తిన చెయ్యి పెట్టుకొని వెంటనే ఓ శపథం చేసేశాను!''

''ఏ.. వనేవ్.. నా కొంప కూల్చేది కాదుగదా అది!''

''నన్ను పట్టుకు అంతమాట అంటావా.. రెండు సంవత్సరాలలోగా నిన్ను బొమ్మను చేయకపోతే నా పేరు మీ అబ్బాయికి పెట్టి నానా హింసలకూ గురిచేస్తాను- అని!''

ఇక్కడకు వస్తున్నట్లుగా ఫోను చేసిననాడు ఒక చెయ్యినే నెత్తిన పెట్టుకుంటే, వారం తిరక్కుండానే రెండు చేతులూ నెత్తిన పెట్టుకుండేలా చేసింది ఇప్పుడు!

★ ★ ★

అనుకున్నదానికంటే ఒకరోజు ముందే మా ఆఫీసుపని అయిపోయింది. ఒక విధంగా నేనే కాస్త హడావుడి చేసి పూర్తి చేసేశాను. ఒక రోజయినా పూర్తిగా శశిరేఖతో గడపకుంటే ఈ జనవరి చలిలో ఇంత దూరం రావటంలో అర్థం లేదనిపించింది.

ఇంటికి టాక్సీలో పడి వచ్చేటప్పటికి తొమ్మిదిగంటలయింది.

సాయంత్రం ఆరునుంచీ శశిరేఖ అరవైసార్లయినా నా సెల్‌ను వాయించి వుంటుంది. నా అదృష్టం నాకు వచ్చే కాల్స్ ఉచితం!

''రేపుదయం ఏడు గంటలకల్లా బయటపడితే రాత్రి పదిగంటలకే తిరిగి రావటం!''

''నీ ఇష్టం.. ఎల్లుండి ఉదయం ఫలక్‌నామా ఎక్కేటంతవరకూ ఈ శరీరం శశిరేఖార్పణం!''

ఉదయం ఐదింటికే లేపి కూర్చోబెట్టింది.

''ఏడింటికి రోడెక్కకపోతే వెయ్యి రూపాయిల పెట్రోలు తగల పెట్టటం అయ్యేపని కాదు. మళ్ళా రాక రాక వస్తే కలకత్తాలో పావు భాగం కూడా చూపించలేదని జీవితాంతం నన్ను దెప్పిపొడుస్తూనే వుంటావ్!''

''నాకు ఎక్కడికీ కదలకుండా తలుపులేసుకొని గదిలో నీతో ఒంటరిగా కూర్చోవాలని వున్నది!''

''నా మొఖంలో నీకేం కనబడతాయని.. సంవత్సరం తిరక్కుండా మా నాన్నకు ఇక్కడ మూడేళ్ళు నిండుతాయి. తరువాత మనకు కలకత్తా రావాల్సిన పనే లేదు కాని.. లేచి తయారవ్వు!''

ఎంత హడావుడి పడ్డా ఇంటి దగ్గరే ఎనిమిదయింది. తినటానికంటూ కారు డిక్కీలో వంద రకాలు పడేసింది.

నేను బూట్లేసుకుంటుండగా నా గదిలోకి వచ్చిన దాన్ని చూస్తూ ముఖం చిట్లించాను. బిగుతైన వెలిసిన జీన్స్ ప్యాంటు, తెల్లటి టీ షర్టుతో అద్దాల షోకేసులో బొమ్మలా తయారయి కురచ జుట్టును పైకి నెట్టుకుంటూ వచ్చింది. ఆ అవతారానికి తోడు కళ్ళకు చలవ అద్దాలు!

నీరసంగా దాని మొఖంలోకి చూస్తూ ''నేను రావడం లేదు!'' అన్నాను నిరసనగా వెంటనే.

''అదేం?'' అన్నది వింతగా నా దగ్గరిగా వచ్చి.

''ముందు లోపలకు వెళ్ళి చీర కట్టుకురా.. నీ ముఖంలా వున్నావ్ ఈ డ్రస్సులో. మరీ బరితెగించినట్లున్నది ఈ వేషం!''

''ఇప్పటినుంచే ఆంక్షలా మొగుడా.. స్త్రీ స్వాతంత్ర్యాన్ని హరించే ఈ మొగవాళ్ళంటే నాకు పరమ అసహ్యం!'' అన్నది వెక్కిరింతగా మొఖం పెట్టి. ''అయినా.. నువ్వే అంటివి గదా నా ముఖం ముందు ఆకాశంలో చందమామ దిగదుడుపేనని! మరి నా ముఖంలా నేనున్నానంటే..'' సాగదీస్తోంది.

''నోర్మూసుకుని చెప్పింది చెయ్యి!''

ఒక్కసారి కళ్ళజోడు విదిలించి నా మంచం మీద పారేసి తన గదిలోకి వెళ్ళిపోయింది మెలికలు తిరిగిపోతూ విసవిసా. బాగా కోపమొచ్చినట్లున్నది. రానీయ్.. అయినా ఆ వేషమేమిటి.. ఆడపిల్ల ముద్దబంతిపువ్వులా ముచ్చటగా వుండాలి గానీ.. ములక్కాడలా నిగడతన్నా.. దాన్ని అదుపులో పెట్టకపోతే నా బ్రతుకు నలుగురిలో నవ్వుల పాలయ్యేలా వున్నది.

తరువాత పది నిముషాలకే నా గదిలోకి వచ్చింది. ఒక్కసారిగా దీపం వెలిగించినంతగా వెలుగునిస్తూ.

''ఇప్పుడు బాగున్నానా అమ్మమ్మలా?'' అన్నది చిటపటలాడుతూ, జారిపోతున్న గులాబీ రంగు పమిటను సర్దుకుంటూ.

''తలుపేసి వస్తే తనివితీరా ముద్దుపెట్టుకుంటాను''

''ఛుప్!''

కారు ఎక్కి కూర్చున్నా మాట్లాడలేదు అది.

''ఇప్పుడెక్కడకు వెళ్తున్నాం?'' అన్నాను దాని భుజం చుట్టూ చేయి వేసి అనునయిస్తున్నట్లుగా దగ్గరకు తీసుకుంటూ.

ఒక్క విదిలింపు విదిలించింది. ''ఎక్కడికో అక్కడికి తీసుకు వెళతానులే... నన్ను మాట్లాడించబోకు!''


''యాభై ఏళ్ళ క్రితం వచ్చిన మాయాబజారు చూశావా శశిరేఖా.. అలా వెన్నెల్లో బోటు షికారు చేస్తూ 'లాహిరి.. లాహిరి.' పాట పాడాలనిపిస్తోందోయ్! అప్పటిదాకా నేనూ మాట్లాడనులే''

దానిది తెచ్చి పెట్టుకున్న కోపమని దాని ముఖమే చెబుతోంది. నా మాటలకు బుగ్గలు పొంగి ఎర్రబడినయ్. రంగేసుకున్న పెదాలు సాగినయి. చెవులకున్న జూకాలు ఊగేలా ఏదో పాటను హమ్ చేస్తోంది స్టీరింగ్ మీద వేళ్ళతో కొడుతూ.

''రేప్పొద్దున ఫలక్‌నామా ఎక్కిందాకా నేను అన్నది ఏది కాదన్నా హౌరా బ్రిడ్జి మీదనుంచి కారును దూకిస్తా!''

''జీ హుజూర్.. దూకింతరువాతయినా నా మాట వింటావా?''

''అప్పటి పరిస్థితిని బట్టి!'' అన్నది కొరకొరా నా వంక చూస్తూ కొంటెగా నవ్వి ''ముందు దక్షిణేశ్వర్ వెళ్దాం.. ఆపైన వివేకానంద మెమోరియల్.. భోజనం.. షాపింగ్.. మూడుగంట



లకు నిక్కో-పార్క్.. అక్కడ లాహిరి.. లాహిరి!'' అన్నది ఊగిపోతూ.

అది ఏం అన్నా, ఎటు తీసుకువెళుతున్నా నేను నోరు తెరవదలుచుకోలేదు.


దాని అందం నన్ను అలా కట్టిపడేస్తోంది. ఆ ఓర చూపులూ, ఎర్రటి పెదవుల కదలికలు, నవ్వీ నవ్వకుండా నవ్వినప్పుడు పడే బుగ్గల్లో సొట్టలు, ''రంభా! నేను నీకు దూరంగా బ్రతకలేను... ఇక్కడే ఎక్కడో, ఎప్పుడోదాకా ఎందుకు ఇప్పుడే మూడు ముళ్ళూ వేసేస్తాను, పద!'' అన్నట్లుగా శశిరేఖను సూదంటురాయిలా అతుక్కు-పోతున్నాను.

అసలు ఇన్నాళ్ళు దూరమయి ఎలా ఉండగలిగానో నాకే అర్థం కావటం లేదు.

అయినా మాకు ఇంకా పెళ్ళినే ఆ అడ్డంకి దేనికి? అంతగా అయితే పెద్దవాళ్ళకు ఇష్టమిచ్చినప్పుడు తీరిగ్గా మా ఇద్దరినీ పీటల మీద కూర్చోబెట్టి ఆ వేడుకను తనివితీరా తీర్చుకోవచ్చు. కాదన్నదెవరు?

దక్షిణేశ్వర్‌లో కాళికాదేవి ముందు నిలబడి దణ్ణం పెట్టుకున్నాను. ''మేం యిద్దరం చిలకా గోరింకల్లా వెయ్యేళ్ళు వర్ధిల్లాలని!'' అది ఏమని కోరుకున్నదో నాకు తెలియదుగాని కళ్ళను ఓరగా పెట్టి అటువైపు చూస్తే, అది తన్మయంగా నన్నే చూస్తున్నదనిపించగా, అది దేవాలయం అని 'గూడా మర్చిపోయి చేయి పట్టుకొని బరబరా బయటకు లాక్కు-వచ్చాను.

''మా అమ్మకు ఫోన్ చేస్తున్నాను'' అంటూ సెల్‌ను బయటకు తీశాను.



## చక్కనమ్మ చార్మి!

**ఈమధ్య హీరోయిన్లకి బరువు తగ్గడంపై మోజు బాగా పెరుగుతోంది. నమిత అతి కష్టం మీద బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటే నయనతార ఆశ్చర్యకరంగా స్లిమ్మయి ట్రిమ్‌గా కనిపిస్తోందిప్పుడు. ఆ బాటలో చార్మి కూడా చేరింది. సుమంత్ హీరోగా నటిస్తున్న 'చిన్నోడు' సినిమాలో హీరోయిన్ అయిన చార్మి కొత్త గ్లామర్‌తో అలరించబోతోంది. దాదాపు 9 కిలోల బరువు తగ్గిందిట చార్మి. చక్కనమ్మ చిక్కినా అందమే కదా!**

''ఏమని?'' అన్నది మూతిని సున్నాలా చుట్టి నన్నే మురిపెంగా చూస్తూ.

''నేనిక ఆగలేనని!''

''ఈ చలికాలంలో హుగ్లీనదిలో రెండు మునకలు వేస్తే హాయిగా వుంటుంది!'' అన్నది కిలాకిలా నవ్వుతూ.

రామకృష్ణ పరమహంస గడిపిన గదిలో నిశ్శబ్దంగా బాసికట్టు వేసుకు కూర్చుని ధ్యానంలో మునిగిపోయిన దాన్ని చూస్తుంటే నాకు ముచ్చటేసింది.

వివేకానందా మెమోరియల్‌కు వెళ్ళాం. ఆ పచ్చటి గడ్డిమీద, చెట్ల క్రిందగా చల్లటి గాలి ఎంతో ఆహ్లాదం కలిగిస్తోంది.

హోటల్లో భోజనం చేసి, ఎస్ప్లనేడ్‌లో నాకూ నాన్నకూ బూట్లు, అమ్మకు చెప్పులూ, హ్యాండ్ బాగు కొనుక్కు-ని సాల్ట్‌లేక్‌కు బయల్దేరేటప్పటికి నాలుగు గంటలయింది. ఐదు గంటలకల్లా నిక్కో- పార్క్-ముందు శశిరేఖ కారును పార్క్ చేసింది.

''మనం లవ్వర్స్ పార్కు-లో ఎప్పుడు తిరగాలి మొగుడా?'' అన్నది హొయలు పోతూ, నా చేతిని గట్టిగా పట్టుకొని నా భుజం మీద తల వాల్చేస్తూ.

శశిరేఖ నడుం చుట్టూ చేయి వేసి దగ్గరకు తీసుకున్నాను.

''మనం ఏ పార్కు-లో కాలుపెడితే అదే లవ్వర్స్ పార్కు!''

''విక్టోరియా మెమోరియల్ చూడవా మరి!''

''మహారాజ్ఞే ఎదుట వుండగా, మరెక్కడికో వెళ్ళటమెందుకు భామా? నీ అందంతో నన్ను పిచ్చివాడిని చేస్తుండగా ఈ పార్కు-లూ, మెమోరియల్సూ దేనికి? ఏదైనా హోటల్లో గది తీసుకొని హాయిగా ఒకరి కౌగిలిలో మరొకరం ఇమిడిపోయి స్వర్గ ద్వారాలు తెరిచేద్దాం, పద!''

''అందమైన స్త్రీని వివాహం చేసుకోవాలనుకోవటం వేసిన రంగుల్ని చూసి ఇల్లు కొనుక్కో-వటం లాంటిదని ఓ ఇంగ్లీషు రచయిత అన్నాడు!'' పార్కు-లో చెట్లమీద పక్షులన్నీ ఒక్క-సారిగా ఎగిరినయ్యా అన్నట్లుగా నవ్వుతూ అన్నది శశిరేఖ.

''బెంగాలీ ఆడవాళ్ళకు భర్తంటే అమిత ప్రేమేమో అనిపిస్తోంది. ఆ ముసలి జంటను చూడు.. అంత వయస్సులోనూ చేతులూ చేతులూ కలుపుకుని ఎలా పార్కు-ల వెంట తిరుగుతున్నారో!''

''అంత సీనేం లేదులే.. రోడ్డు మీద ఏదైనా కొట్టుకొని ముసలాయన ముందుకు పడ్డాడంటే, ఆయనగారిని మంచం మీద కూర్చోబెట్టి తనే అన్నీ చేయాల్సి వస్తుందని ఆవిడగారి భయం!''

''అబ్బ! నీది ఏం వితర్కమే!'' అన్నాను పక్క-నే పంచవన్నెల చిలకల్లా ఎగురుతున్న ఆడపిల్లల వంక చూస్తూ.

''ఇదుగో..ఎర్రగా బుర్రగా వున్నారు గదా అని బెంగాలీ అమ్మాయిల వంక నోరు తెరుచుకు చూస్తుండేవ్..ఎనిమిది కాళ్ళ దోమలు దూరినయ్యంటే.. ఓ వారం రోజులో, పదిరోజులో నోరు మూతపడకుండా దగ్గు వచ్చేస్తుంది. దానికి మందు లేదు!'' అన్నది నా చేయి పట్టుకుని అక్క-డనుండి బరబరా లాక్కు-వెళుతూ.

చిన్న సరస్సు.. మనమే తెడ్డువేసి నెట్టుకుంటూ వెళ్ళే రంగురంగుల బోట్లు.. వాటిల్లో తిరుగుతున్న జంటలు, కేరింతలు కొడుతున్న పిల్లలు.. వాళ్ళను చూస్తూ చేతులూపుతూ చుట్టూ ఒడ్డుమీద గడ్డిలో కూర్చున్న జనం.

చల్లటిగాలి. మబ్బుల్లేని ఆకాశం. అయిదు గంటలకే చీకటి పడుతున్నట్లనిపించగా కనబడీ కనబడని నక్షత్రాలు. పార్కు-లో వెలుగుతున్న దీపాలు.

''వహ్వా'' ఆ చిన్న బోటులో మొట్టమొదట కాలుపెట్టింది నేనే.. ''లాహిరి.. లాహిరి.. లాహిరిలో'' పెదాలు అల్లల్లాడుతున్నాయ్.

★ ★ ★

రాత్రి తొమ్మిదయింది. అత్తయ్య మామయ్య తెలిసిన వాళ్ళింట్లో పెళ్ళయితే వెళ్ళారు. వాళ్ళు వచ్చేటప్పటికి పన్నెండు అయినా అవ్వచ్చు.

''తొందరగా స్నానం చేసిరా.. భోజనం చేసి పడుకుంటే.. మళ్ళా తెల్లవారకముందే లేవాలి.. ఇంటి దగ్గర ఆరుకు బయల్దేరితేగానీ ఫలక్ నామా అందుకోలేవు!''

## తెలుగులో తొలి సీక్వెల్?

**హిందీ చిత్రం 'మున్నాభాయ్, ఎం.బి.బి.ఎస్.' తెలుగులో చిరంజీవి హీరోగా 'శంకర్ దాదా ఎం.బి.బి.ఎస్.' పేరిట వచ్చి హిట్ అయింది. మున్నాభాయ్‌కి సీక్వెల్‌గా తాజాగా రిలీజైన 'లగే రహో మున్నాభాయ్' కూడా హిట్ కావడంతో దీన్ని సైతం తెలుగులో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు 'శంకర్‌దాదా' నిర్మాతలు. ఇందులో కూడా చిరంజీవినే హీరోగా నటింపచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయిట. కానీ ఈ విషయంలో చిరంజీవి నుంచి అంత ఆసక్తి కనిపించడంలేదని సినీ వర్గాలు అంటున్నాయి. ఏదేమైనా ఈ సినిమా గనక నిర్మించడం జరిగితే తెలుగులో కూడా సీక్వెల్ యుగం మొదలవుతుందేమో!**

కానీ నా ఒళ్ళు కాగిపోతున్నదే.. ''ఇద్దరం కలిసి ఒకేసారి చేసేస్తే అలసట త్వరగా తీరుతుంది గదా!'' అన్నాను కళ్ళు చికిలించి శశిరేఖ వంక నవ్వుతూ చూస్తూ.

ఒక్కసారి పెద్దగా నవ్వేసి, ''ఛీ! పో'' అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది విసవిసా.

నేను బ్రీఫ్ కేసు తెరిచి, తెల్లకాగితాల ప్యాడ్ తీసి, దాని మీద ఇలా రాశాను.

మకరకేతను గూర్చి మకరికా లతలు నీ
చెక్కుల వ్రాయంగ మ్రొక్కుకొంటి
గుసుమాకరుని గూర్చి కుసుమ మాలికలు నీ
వేనలి దుఱుమంగ వేడుకొంటి
గంధవాహను గూర్చి గంధసారంబు నీ
గుబ్బల బూయంగ గోరుకొంటి
మృగలాంఛనుని గూర్చి మృగమదంబున నీకు
దిలకంబు దిద్ద బ్రార్థించుకొంటి
నిన్ను వరియించునప్పుడే యిన్ని చేయు
వాడ నని మున్ను శృంగార వనములోన
వల పెఱిగి యేలుకోగదే కలికి!

అడుగున ఇది కూడా కలిపాను. ''పైన నేను రాసింది నీకు అర్థమయితే ఇంటి తలుపులన్నీ బిగించి నా గదిలో జేరిపో.. మామయ్యా, అత్తయ్యా వచ్చిందాకా నేను నీకు స్వర్గం చూపిస్తాను!''

ఆ కాగితాన్ని తీసి అలాగే తెరిచివుంచి, అది ఫ్యానుగాలికి ఎగిరిపోకుండా దానిమీద నా పెన్ను పెట్టి, దాని అడుగుల సవ్వడి వింటూనే బాత్‌రూంలోకి దూరిపోయి, తలుపేసుకున్నాను.

అయిదు నిముషాలల్లో స్నానం చేసి, బయటకు వచ్చేటప్పటికి, అక్కడే వుంటుందనుకున్న శశిరేఖ అక్కడ లేక పోగా, నా గది తలుపులు గూడా మూసి వెళ్ళిపోయింది!

టీపాయ్ మీద నేను రాసిపెట్టిన కాగితం చదివిందా లేదా అని ఆత్రంగా ముందుకు వచ్చి చూస్తే ఆ కాగితం మీదే నేను రాసిన దాని క్రిందుగా ఏదో గిలికింది. చటుక్కున దాన్ని అందుకొని కళ్ళు చించుకు చదవసాగాను.

నిక్కము దాప నేల ధరణీసురనందన! యింక నీ పయిన్
జిక్కె మనంబు నాకు, నను జిత్తజుబారికి నప్పగించెదో?
చొక్కి మరందమద్యముల చూఱల బాటలువాడు తేంట్లు సొం
పెక్కినయట్టి పూవు బొదరిండ్లను గౌగిట గారవించెదో?

జీన్స్ ప్యాంటు, టీ షర్టూ వేసుకొని, జుట్టు కత్తిరించేసుకున్నాను గదా అని నువ్వేదో నా గురించి వింత వింత ఊహలతో మనస్సు పాడుచేసుకుంటున్నట్టున్నావు. రోమ్‌లో వున్నప్పుడు రోమన్‌లా వుండమన్నారు గదా అని కాస్తంత రూపం మార్చిన మాట వాస్తవమేగాని, మన సంస్కృతినీ, సాంప్రదాయాల్నీ, మాతృభాషనీ మరిచిపోయేటంతగా కాదు. నేను నీకు అర్థంగాకపోయినా విజయవిలాసంలోని నీ పద్యం నాకు అర్థమయింది. కానీ నేను పెద్దనగారి వరూధుని లాంటి ప్రబంధనాయికను కాదు, వచ్చి నీ వళ్ళో వాలిపోయేటందుకు.



ఇంకో విషయం నిన్న రాత్రి పదకొండు గంటలప్పుడు మా అమ్మ, మీ అమ్మతో ఫోనులో ఏదో గుసగుసలాడుతోంది... చూస్తే, వాళ్ళిద్దరూ కలిసి త్వరలోనే మనిద్దరికీ ఓ కొంప కట్టేలా వున్నారు.

అది రాసింది చదివిన నేను, నా తొందరపాటుకు సిగ్గుపడుతూ తల ఎత్తకుండానే మంచం మీద మునగదీసుకు కూర్చున్నాను. మూసి వున్న తలుపు శబ్దమయ్యేలా తెరుచుకున్నది. శశిరేఖ లోపల కాలుపెడుతూనే ''అలా బుద్ధూలా నోరు తెరుచుకు కూర్చోకపోతే లేచి కాస్త వడ్డనలో సాయం చెయ్యగూడదూ! నీకు ముందే చెప్పాను ఇక్కడ దోమలెక్కువని.. నోరు మూసుకొని జాగ్రత్తగా వుండాలని'' అన్నది పకపకా నవ్వుతూ.

సరి సరి.. ఇప్పటికే కుంజరయూథంబు దోమ కుత్తుక జొచ్చెన్.. అన్నట్లుగా అయిపోయింది నా పని! ఇక నేనేం మాట్లాడేది?

☆